క్లుప్తంగా

ముస్లిం సోదరుల దీపాల పండగ


దీపాలను వెలిగిస్తున్న ముస్లిం మహిళలు

విజయనగరం టౌన్: హజరత్ జిందేషా మదార్ ఔలియా చందనోత్సవం పురస్కరించుకుని చిరాఖిల పూజ (దీపాల పండగ)ను పెద్ద పూల తోట వద్దనున్న ఔట్‌ఖానా వెళ్లే దారిలో సోమవారం రాత్రి భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనల అనంతరం మహిళలు దీపాలను వెలిగించారు. అనంతరం అన్నదానం, పూజా కార్యక్రమాలు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో ముస్లిం సోదరులు, సోదరీమణులు పాల్గొన్నారు.

క్రికెట్ కిట్ వితరణ


హెచ్‌ఎంకు క్రికెట్ కిట్ అందజేస్తున్న యు టు కెన్ గ్రూపు సభ్యులు

పూసపాటిరేగ: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు యు టు కెన్ గ్రూపు సభ్యులు రూ.20 వేల విలువైన క్రికెట్ కిట్‌ను హెచ్‌ఎం బి.శంకర్రావుకు సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం శంకర్రావు మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు శేషసాయి, సంస్థ ప్రతినిధులు సాయిదీప్, హర్ష, ప్రవీణ్‌రాజ్, ధనంజయ్, బలరామ్‌కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం సేకరణపై శిక్షణ


శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

నెల్లిమర్ల: ధాన్యం సేకరణపై వ్యవసాయ శాఖ చీపురుపల్లి ఏడీ కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీ మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం రైతుల నుంచి ధాన్యం సేకరణకు పకడ్బందీ చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. ముఖ్యంగా ధాన్యం సేకరణ కొనుగోలులో రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. ధాన్యం సేకరణలో వ్యవసాయ శాఖ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. కార్యక్రమంలో ఏఓ ఎం.పూర్ణిమ, సీఎస్‌డీటీ తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

విజయనగరం ఫోర్ట్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని వన్‌స్టాప్ సెంటర్ కేస్ వర్కర్ టి.అనిత అన్నారు. పట్టణంలోని ఎస్‌ఎస్‌ఎస్ జూనియర్ కళాశాలలో సోమవారం బాల్య వివాహాలపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. బాల్య వివాహాల వల్ల తరచూ అనారోగ్యానికి గురవుతారన్నారు. బాలికలు మంచి, చెడు స్పర్శలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అన్నారు.

వినతుల పరిష్కారానికి చర్యలు

విజయనగరం: ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చిన వినతులను తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని విజయనగరం నగరపాలక సంస్థ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజల నుండి మూడు వినతులు వచ్చాయి. టౌన్ ప్లానింగ్ విభాగానికి సంబంధించి రెండు వినతులు, ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఒక వినతి వచ్చాయి. వీటిని ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నామని తెలిపారు. ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, ఈఈ టి.రాయల్ బాబు, అసిస్టెంట్ సిటీ ప్లానర్ రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సంక్షోభ వసతిగృహాలు

- హాస్టళ్లలో విద్యార్థుల అవస్థలు
- పెచ్చులూడుతున్న పైకప్పులు
- అద్దాలు లేని కిటికీలు.. తలుపుల స్థానంలో దుప్పట్లు

విజయనగరం: పెచ్చులూడుతున్న పై కప్పులు.. అద్దాలు లేని కిటికీలు.. తలుపులకు బదులు విద్యార్థులే దుప్పట్లు అడ్డం పెట్టుకునే దీన స్థితిలో నగరంలోని రాజ్యలక్ష్మి థియేటర్ సమీపంలో గల బీసీ బాలుర వసతిగృహ విద్యార్థులు చదువులు వెళ్లదీస్తున్నారు. ఈ వసతిగృహంలో విజయనగరం జిల్లాతో పాటు విశాఖ జిల్లాకు చెందిన విద్యార్థులు వసతి ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. ఇటీవలే ఇదే హాస్టల్‌లో ఉండే విద్యార్థి అనారోగ్యంతో మృతి చెందటం కలకలం సృష్టించినప్పటికీ అధికార యంత్రాంగంలో ఎటువంటి చలనం లేకపోవటం గమనార్హం. వసతి గృహంలో 6 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు 100 మంది ఉండాల్సి ఉండగా.... ప్రస్తుతం 25 మంది మాత్రమే వసతి పొందుతున్నారు. వసతిగృహంలో విద్యార్థులు పడుకునే గదుల్లో కొన్నింటికి తలుపులు లేకపోగా... మరికొన్ని తలపులు పగిలిపోయి దర్శనమిస్తున్నాయి. గదులు ఉండే కిటికీల అద్దాలు ఒక్కటీ లేకపోవటంతో రాత్రి వేళల్లో చలికి వణకాల్సిన పరిస్థితి దాపురించింది. అద్దె భవనంలో ఈ వసతి గృహం నడుస్తుండగా... శిథిలావస్థకు చేరిన భవనం పైకప్పు పెచ్చులూడిపోతుండటంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న భయం దోళనలో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. మెనూ అమలు సక్రమంగా సాగటం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

విద్యార్థులే స్వీపర్లు..!

విజయనగరం రూరల్: జిల్లా కేంద్రానికి కూతవేటు దూరంలో ఉన్న జొన్నవలస గ్రామంలోని బీసీ సంక్షేమ బాలుర వసతిగృహం పరిస్థితి దయనీయంగా ఉంది. 19మంది విద్యార్థులు ఇక్కడి వసతి పొందుతున్నారు. అయితే 2004లో ఏర్పాటు చేసిన వసతిగృహం పూర్తిగా శిథిలావస్థకు చేరినప్పటికీ అందులోనే భోజనం, స్నానం, వంటి కార్యక్రమాలను విద్యార్థులు నిర్వహిస్తున్నారు. ఒకవైపు గోడలు, మరోవైపు శ్లాబ్ పెచ్చులూడిపోయి కూలేందుకు సిద్ధంగా ఉన్నప్పటికీ విద్యార్థులు అక్కడే తమ కాలకృత్యాలను తీర్చుకోవడమే కాకుండా ఆటలతో ఎక్కువ సమయం గడుపుతున్నారు.

పాత భవనం తాత్కాలికంగా మార్పు

వసతిగృహం భవనం పూర్తిగా శిథిలమైపోవడంతో 19మంది విద్యార్థులు పక్కనే ఉన్న ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల భవనం పై అంతస్తులో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అయితే మొదటి నుంచి ఈ ప్రాంగణం అలవాటు కావడం, అలాగే ఇక్కడే భోజనాలు, స్నానాలు, మరుగు ఏర్పాటు ఉండడంతో విద్యార్థులు అధికశాతం సమయం ఇక్కడే గడపాల్సి వస్తోంది. వసతిగృహాల్లో ఉన్న విద్యార్థులకు మెనూను సిబ్బందికి నచ్చిందే వడ్డిస్తున్నట్లు పలువురు విద్యార్థులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులచే కొన్ని పనులు చేయిస్తున్నట్లు చెబుతున్నారు. పాత వసతిగృహం శిథిలావస్థకు చేరినట్లు ఉన్నతాధికారులకు నివేదిక పంపించినట్లు తెలియజేశారు.

అద్దె కొంపలో హాస్టల్

డెంకాడ: మండలంలోని పెదతాడివాడలో ఉన్న బీసీ బాలుర వసతిగృహం అద్దె కొంపలోనే నడుస్తోంది. 60 మంది విద్యార్థులు ఉంటున్నారు. వీరికి అద్దెగృహంలో వసతి చాలడం లేదు. ఉన్న చిన్నగదుల్లోనే చుట్టూ పెట్టెలు పెట్టుకుని మధ్యలో ఇరుకుగా ఉంటున్నారు. డెంకాడ, పూసపాటిరేగ మండలాలతో పాటు వివిధ గ్రామాల నుంచి వచ్చి విద్యార్థులు ఇక్కడ హాస్టల్‌లో ఉంటున్నారు.

గాడి తప్పిన సంక్షేమ వసతిగృహాలు

పూసపాటిరేగ: ప్రభుత్వ సంక్షేమ వసతిగృహాలు గాడి తప్పాయి. వసతిగృహాల విద్యార్థులు మౌలిక సదుపాయాలకు దూరంగా గడుపుతున్నారు. మరుగుదొడ్లు , తాగునీటి సమస్య, వసతి సమస్యతో విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు. పూసపాటిరేగ బీసీ బాలుర వసతిగృహం, పూసపాటిరేగ కళాశాల బాలుర వసతిగృహం ఒకే భవనంలో నిర్వహిస్తున్నారు. బాలికల కోసం నిర్మాణం అయిన భవనంలో రెండు వసతిగృహాలు నిర్వహిస్తున్నారు. రెండు వసతిగృహాల్లోనూ మరుగుదొడ్ల సమస్య వేధిస్తోంది. స్కావెంజరు లేకపోవడంతో అపరిశుభ్రంగా వున్నాయి. పూసపాటిరేగ బీసీ వసతిగృహంలో 45 మంది, కళాశాల వసతిగృహంలో 85 మంది విద్యార్థులు వున్నారు. చింతపల్లి బీసీ సంక్షేమ వసతిగృహం అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. 40 మంది విద్యార్థులు వుంటున్నారు. గోవిందపురంలో 35 మంది విద్యార్థినిలు విద్యను అభ్యసిస్తున్నారు. కొప్పెర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 450 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తుండగా సరిపడా మరుగుదొడ్లు లేకపోవడంతో ఆరుబయటకు మలవిసర్జనకు వెళ్తున్న పరిస్థితి.

నెల్లిమర్ల బీఆర్ అంబేడ్కర్ గురుకులంలో 482 మంది విద్యార్థులు ఉన్నారు. మరుగుదొడ్ల సమస్యతో పాటు ప్రహరీగోడ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. బొప్పడాం బీసీ బాలుర వసతిగృహంలో 120 మంది విద్యార్థులుండగా.. మరుగుదొడ్లు సరిగా నిర్వహించకపోవడంతో అవస్థలు పడుతున్నారు. అలుగోలు బీసీ వసతిగృహంలో 76 మంది విద్యార్థులుండగా భవనం పూర్తిగా శిథిలమవడంతో భవనం వేరే గదిలోకి మార్చారు. భోగాపురం బీసీ బాలుర వసతిగృహం శిథిలమై కూలడానికి సిద్ధంగా వుండటంతో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోకి మార్పు చేసారు. రావాడ బీసీ బాలుర వసతిగృహంలో 82 మంది విద్యార్థులుండగా.. మరుగుదొడ్లు నిర్వహణ సక్రమంగా లేకపోవడంతో ఇబ్బంది పడుతున్నారు.


విజయనగరం: బీసీ బాలుర వసతిగృహం గదుల్లో పెచ్చులూడిన గోడలు, శ్లాబు


విజయనగరం: బీసీ బాలుర వసతిగృహంలో ముక్క చెక్కలైన గది తలుపు


విజయనగరం: బీసీ బాలుర వసతిగృహం గదుల్లో కిటికీలకు తలుపులు లేకపోవడంతో దుప్పట్లు కట్టుకున్న విద్యార్థులు


విజయనగరం రూరల్: శిథిలగృహంలో విద్యార్థులు


నెల్లిమర్ల బీఆర్ గురుకులంలో శిథిలమైన మరుగుదొడ్ల తలుపులు


డెంకాడ: పెదతాడివాడ బీసీ బాలుర వసతిగృహం గదిలో ఇరుకుగా సమకూర్చుకున్న విద్యార్థుల పెట్టెలు

పన్ను బకాయిదారులకు రెడ్ నోటీసులు


బకాయిదారుల వద్ద పన్నులు వసూలు చేస్తున్న సిబ్బంది

విజయనగరం: నగర పరిధిలో ఆస్తి, కుళాయి పన్నుల మొండి బకాయిలను ఉపేక్షించబోమని కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లకై ఆయన ప్రత్యేక కార్యాచరణను ఆదేశించిన నేపథ్యంలో రెవెన్యూ సిబ్బంది, అడ్మిన్ కార్యదర్శులు బృందాలుగా ఏర్పడి పన్నులను రాబడుతున్నారు. ముఖ్యంగా మొండి బకాయిలపై దృష్టి సారించి వారి నుంచి పన్నుల వసూళ్లు చేపడుతున్నారు. పన్నులు చెల్లించని వారికి రెడ్ నోటీసులు జారీ చేస్తున్నారు. కుళాయి పన్నులు ఎక్కువ మొత్తంలో బకాయి ఉన్నట్లయితే తక్షణమే చెల్లించాలని కోరగా కొంతమంది ఏక మొత్తంలో బకాయి పడ్డ పన్నులను చెల్లిస్తున్నారు. లేకుంటే కుళాయి కనెక్షన్లను సిబ్బంది తొలగించి వేస్తున్నారు. పన్నుల వసూలుకై ప్రత్యేక కార్యాచరణను ఉద్దేశించి కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ పన్నుల మొండి బకాయిలను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించమని స్పష్టం చేశారు. మొండి బకాయిల పట్ల ప్రత్యేక దృష్టి సారించామని, ప్రతి ఒక్కరూ పన్నులు సకాలంలో చెల్లించవలసిందేనని తెలిపారు. నగరంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడాలన్నా, నగరం అభివృద్ధి చెందాలన్నా ప్రజలు చెల్లించే పన్నులతోనే సాధ్యమన్న విషయాన్ని గమనించాలని కోరారు.

సహకార రంగాలను బలోపేతం చేయాలి

- డివిజనల్ సహకార అధికారి రామ్మూర్తి

విజయనగరం ఫోర్ట్: సహకార రంగాలను, సొసైటీలను బలోపేతం చేయడం ద్వారానే వికసిత్ భారత్ నిర్మాణం జరుగుతుందని డివిజనల్ సహకార అధికారి డి.రామ్మూర్తి అన్నారు. స్థానిక శ్రీ వెంకటేశ్వర ఏపీఈపీడీసీఎల్ ఉద్యోగుల కోపరేటివ్ క్రెడిట్ సొసైటీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సహకార వారోత్సవాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. సహకారం ఉంటేనే ఆర్థిక సమస్యలు పరిష్కారం కావడంతో పాటు మనలో సహకార భావం పెరుగుతుందన్నారు. సహకార సొసైటీలు బలోపేతం కావడం ద్వారా రుణాల కోసం బ్యాంక్‌లు చుట్టూ వెళ్లాల్సిన అవసరం ఉండదన్నారు. విద్యుత్ ఉద్యోగులు సొసైటీ ఉద్యోగికి రూ.15 లక్షలు వరకు ఉండటం అభినందనీయమన్నారు. హౌసింగ్ రుణాల విషయంలో అధికారులు దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అనంతరం వికసిత్ భారత్ నిర్మాణంపై ప్రమాణం చేసారు. కార్యక్రమంలో సహకార ఎడ్యుకేషనల్ అధికారి రమేష్, డి.ఆర్.ప్రసాద్, రాజేంద్రప్రసాద్, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


వికసిత్ భారత్ నిర్మాణంపై ప్రమాణం చేస్తున్న ఉద్యోగులు

స్కిల్ సెన్సెస్‌పై శిక్షణ


స్కిల్ సెన్సెస్‌పై సిబ్బందికి శిక్షణ ఇస్తున్న ఎంపీడీఓ

భోగాపురం: మండలంలోని అన్ని గ్రామాల్లో వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన వ్యక్తులను గుర్తించాలని ఎంపీడీఓ కిషోర్‌కుమార్ పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి స్కిల్ సెన్సెస్‌పై శిక్షణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. స్కిల్ సర్వే నైపుణ్య యాప్ ద్వారా మండలంలోని అన్ని పంచాయతీల్లోని గ్రామాల్లో వివిధ రంగాల్లో నైపుణ్యం కలిగిన 15 నుంచి 59 సంవత్సరాలలోపు ఉన్న వారిని గుర్తించి సర్వే చేయాలని ఎంపీడీఓ సూచించారు. విద్య, నైపుణ్యం స్థాయిలు తక్కువగా ఉన్న ప్రాంతాలను, సామాజిక వర్గాలను గుర్తించాలన్నారు. అంతరాలను అధిగమించి అవసరమైన మేరకు వనరులను కేటాయించేందుకు ఈ నైపుణ్య గణన సర్వే ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ సర్వే ద్వారా వ్యక్తుల్లోని నైపుణ్యాలు, సామర్థ్యాలను గుర్తించి ఉద్యోగ విపణిలో వాటికి ఉన్న డిమాండ్‌ను అంచనా వేసి వ్యక్తి వారీ అభివృద్ధి ప్రణాళికను తయారు చేసుకునేందుకు అవకాశాలు ఉంటాయన్నారు. ఈఓపీఆర్‌డీ గాయిత్రి, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వండి..



పూసపాటిరేగ మండలం కృష్ణాపురం గ్రామంలో తమ ఆధీనంలో ఉన్న భూములకు పట్టాలిప్పించాలని మాజీ సర్పంచ్ మొంగం నాగబాబుతో పాటు పలువురు సాగుదారులు తహసీల్దార్ తాడ్డి గోవిందకు సోమవారం వినతిపత్రం అందజేశారు. గ్రామంలో సర్వే నంబరు 37 – 1లో తమ భూములు ఉన్నాయని, వాటికి సంబంధించి పట్టాదారు పాసు పుస్తకాలు, టైటిల్‌డీడ్ ఇప్పించాలని కోరారు. దీనిపై తహసీల్దార్ సానుకూలంగా స్పందించి న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధి కొయ్య ఎల్లన్నరెడ్డితో పాటు గ్రామానికి చెందిన పలువురు మహిళలు పాల్గొన్నారు. – పూసపాటిరేగ

మహతి పుస్తకావిష్కరణ



జాతీయ గ్రంథాలయ వారోత్సవాలలో భాగంగా జిల్లా గ్రంథాలయ సేవా సంఘం ఆధ్వర్యంలో సోమవారం గురజాడ కేంద్ర గ్రంథాలయంలో కొంకేపూడి అనురాధ రచించిన మహతి హిందీ కవితా సంపుటి పుస్తకాన్ని రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డీవీజీ శంకరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమాజాన్ని చైతన్యం చేసేవి పుస్తకాలని అన్నారు. పుస్తకాన్ని ప్రభుత్వ డిగ్రీ కాలేజీ అధ్యాపకురాలు డాక్టర్ శుభ సమీక్ష చేసారు. అనంతరం సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డు గ్రహీత రెడ్డి రమణ స్మారక పురస్కారాన్ని పెదపెంకి గ్రామానికి చెందిన నేతాజీ గ్రంథాలయ వ్యవస్థాపకులు ఈర్ల సంజీవనాయుడుకు అందజేసారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, గౌరవ అధ్యక్షుడు ఎస్‌ఎస్‌ఎస్‌ఎస్ రాజు, కార్యక్రమ నిర్వాహకులు రత్నాల బాలకృష్ణ, సంఘం ఉపాధ్యక్షులు కె.దయానంద్, పుస్తక అనువాదకులు పోరంకి నాగరాజు, శ్రీరామమూర్తి తదితరులు పాల్గొన్నారు. – విజయనగరం అర్బన్

నగరంలో ఆక్రమణల తొలగింపు


పార్కు స్థలంలో ఆక్రమణల తొలగింపు

విజయనగరం: విజయనగరం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలు ఆక్రమణలకు గురికాకుండా అవసరమైన రక్షణ చర్యలను చేపడుతున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య స్పష్టం చేశారు. సోమవారం టౌన్ సెంటర్ లేఅవుట్ నందు పార్కు స్థలంలో ఆక్రమణలను తొలగింపజేశారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్ హరిబాబు, ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, టీపీఎస్ అనిత, పారిశుద్ధ్య పర్యవేక్షకుల బృందంతో కలిసి జేసీబీల సహాయంతో ఆక్రమణలను తొలగించారు. ఈ సందర్భంగా కమిషనర్ నల్లనయ్య మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు అన్యాక్రాంతం కాకుండా, ఆక్రమణలకు గురికాకుండా తగిన రక్షణ చర్యలు చేపడతామన్నారు. ఎవరైనా ప్రభుత్వ స్థలాలను ఆక్రమించినట్లు గుర్తిస్తే వారిపై చట్టపరమైన చర్యలను తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ఫుట్‌పాత్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేపట్టరాదని స్పష్టం చేశారు. రామారాయుడు రోడ్డు ప్రాంతంలో ఉన్న ఫుట్‌పాత్‌పై ఉన్న భోజనశాలలను ప్రణాళిక సిబ్బంది అక్కడి నుండి తరలించి వేశారు. ఫుట్‌పాత్‌లను ఆక్రమించి చిరు వ్యాపారాలు చేయరాదని సూచించారు.

ముమ్మరంగా పూడికతీత పనులు


పూడికతీత పనులు

విజయనగరం: నగరంలోని ప్రధాన కాలువలలో పూడికతీత పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రజారోగ్య పరిరక్షణలో భాగంగా ప్రజారోగ్య సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించి జేసీబీలు సహాయంతో పూడికతీత పనులను చేపడుతున్నారు. పండగల సీజన్ కావడంతో ఈ మధ్య కాలంలో పళ్లు, పూలు, ఇతర సామగ్రి క్రయవిక్రయాలు ప్రధాన రహదారులలో జోరుగా సాగాయి. దీంతో చెత్తాచెదారాలు ఎక్కువగా ప్రధాన కాలువల్లో చేరుకున్నాయి. కాలువ నీరు ప్రవాహానికి అడ్డంకిగా మారడంతో గమనించిన కమిషనర్ తక్షణమే చెత్తా చెదారాలను తొలగించాలని ఆదేశించారు. దీంతో యుద్ధ ప్రాతిపదికన జేసీబీలు, బాబ్ కార్ట్‌ల సహాయంతో పూడికలను తొలగించి వేస్తున్నారు. క్షేత్ర స్థాయి పర్యటనలో భాగంగా ఈ రోజు ట్యాంక్ బండ్ రోడ్డు, తోటపాలెం తదితర ప్రాంతాల్లో కమిషనర్ నల్లనయ్య పర్యటించారు. ఎల్‌ఐసీ బిల్డింగ్ ఎదురుగా ఉన్న ప్రధాన కాలువలో పూడిక చేరడానికి గమనించిన ఆయన వెంటనే చెత్తను తొలగించాలని సిబ్బందికి ఆదేశించారు.

శంభో శంకర

కార్తీకమాసం మూడో సోమవారం శివాలయాలు భక్తులతో పోటెత్తాయి. శంభో శంకర అంటూ నినదించాయి. వేకువజాము నుంచే భక్తులు ఆలయాల వద్ద బారులు తీరారు. ప్రత్యేక పూజలు చేశారు.
– సాక్షి నెట్‌వర్క్


విజయనగరం టౌన్: గుమ్చీ సమీపంలో భక్తుల పూజలందుకున్న మహా శివుని విగ్రహం


నెల్లిమర్ల రూరల్: జోగిరాజుపేట శివాలయంలో భక్తుల రద్దీ


నెల్లిమర్ల రూరల్: భాస్కర పుష్కరిణి వద్ద భక్తుల పుణ్యస్నానాలు


విజయనగరం రూరల్: కణపాక ఆలయంలో పూజలందుకుంటున్న ఉమారామలింగేశ్వరుడు


డెంకాడ: చింతలవలస ఏపీఎస్పీ ఐదో బెటాలియన్ వద్ద ఉమామహేశ్వర స్వామి ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు


విజయనగరం టౌన్: రింగ్‌రోడ్డు సింహాద్రినగర్‌లోని ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు